క్లుప్తంగా...

మంత్రికి ఆహ్వానం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు తూముకుంట్ల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వెస్ట్‌కమలానగర్ కాలనీ సభ్యులు ఆదివారం మంత్రి చామకూర మల్లారెడ్డి నివాసంలో కలిశారు. వెస్ట్‌కమలానగర్ కాలనీలో నిర్మిస్తున్న వినాయక మండప నిర్మాణం గురించి మంత్రికి వివరించి వేడుకలకు హాజరుకావాలని కోరారు.

ఎన్‌జీఆర్ఐలో నేటి నుంచి వన్ వీక్ వన్ ల్యాబ్

ఉప్పల్: ఉప్పల్ జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(సిఎస్ఆర్ఐ- ఎన్‌జీఆర్ఐ)లో వన్ వీక్ వన్ ల్యాబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారత ప్రభుత్వ భూ విజ్ఞాన శాఖ మాజీ కార్యదర్శి డా. పిఎస్ గోయల్, డా. ఎన్ కలాసెల్వీ, తెలంగాణ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డు సమస్యను పరిష్కరిస్తాం



మంత్రిని కలిసిన వక్ఫ్ బోర్డు బాధితుల సంఘం ప్రతినిధులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న వక్ఫ్ బోర్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. వక్ఫ్ బోర్డు బాధితుల సంఘం జేఏసీ ప్రతినిధులు ఆదివారం బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ప్రతినిధులు, ప్రమోద్‌కుమార్, అబ్రహం లింకన్, రాజిరెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కాలనీ నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: బోడుప్పల్ 15వ డివిజన్ పరిధిలోని బొల్లిగూడెంలోని శ్రీసాయి ఎస్వై నగర్ కాలనీ అధ్యక్ష ఎన్నికల్లో ఎం. సుబ్బారెడ్డి గెలుపొందారు. అనంతం మిగతా కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి యాదగిరి, కోశాధికారిగా కాల జోసెఫ్, ఉపాధ్యక్షులుగా కాంతారెడ్డి, సత్తయ్య, సలహాదారులుగా బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, మహమ్మద్ మున్నీర్, సూర్య ప్రకాశ్‌రావు, రమేష్ చౌదరిలు ఎన్నికయ్యారు.

ఘనంగా గంగపుత్ర గంగ తెప్పోత్సవం



మల్కాజిగిరి: గంగపుత్ర గంగ తెప్పోత్సవ కమిటీ లాలాగూడ, మల్కాజిగిరి స్థానిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గంగపుత్ర గంగ తెప్పోత్సవము ఘనంగా నిర్వహించారు. లాలాగూడ నుంచి సఫిల్‌గూడ వరకు తెప్పలు,బోనాలు,జలపందిర్లు, పోతరాజు విన్యాసాలతో ఊరేగింపు నిర్వహించి తెప్పోత్సవము నిర్వహించారు. మల్కాజిగిరి చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ వారికి స్వాగతం పలికారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

అల్వాల్: సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత కిషోర్ అధికారులకు సూచించారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కానాజీగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అభివృద్ధి నిర్మాణ పనులలలో అలసత్వం వీడి నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ధిత సమయానికి పనులు పూర్తి చేయాలని కోరారు.

బీజేపీలో పలువురి చేరిక

మేడ్చల్: మున్సిపాలిటీలోని అత్వెల్లి మూడవ వార్డు, వివిధ కాలనీలకు చెందిన యువకులు బీజేపీ లో చేరారు. మున్సిపాలిటీ బీజేపీ నాయకులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజెందర్ నివాసానికి వెళ్ళగా ఆయన పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి ప్రేందాస్ పాల్గొన్నారు.

మూగ జీవులకు అందని వైద్యం

- ఆసుపత్రుల్లో వసతులు కరవు
- అరకొర మందులు..సిబ్బంది కొరత
- జిల్లాలో 2 ఏరియా, 16 పట్టణ, 29 గ్రామీణ పశువైద్య ఆసుపత్రులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వ పశువైద్యశాలల్లో ఒకవైపు మందుల కొరత, మరోవైపు అందుబాటులో సరిపడా లేని సిబ్బంది లేక పోవటంతో మూగజీవాల పెంపకం దారులకు ప్రైవేటు పశు దుకాణాలే దిక్కయ్యాయి. పాడి రైతులకు నిర్వహణ ఖర్చు పెరగడంతో నష్టాలపాలవుతున్నారు. పైగా వర్షాకాలం కావడంతో మూగజీవాలకు అనేక రోగాలు పొంచి ఉన్నాయి.

కనీస వసతులు లేక..

ఇరుకైన గదులు, శిథిలావస్థకు చేరిన వైద్య కేంద్రాలలో సరైన వసతులు లేక పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం తాగునీటి సదుపాయం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఉద్యోగులు, సిబ్బంది పడుతున్న అవస్థ అంతా ఇంతా కాదు. కూకట్పల్లి,గౌడవెల్లి ప్రాథమిక పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థలో ఉండటంతో..వేరే చోట నడిపిస్తున్నారు.

అందని మందులు..

పశు వైద్యశాలలకు ప్రతి మూడు నెలలకొకసారి మందులకు ప్రభుత్వం రూ.7 లక్షల చొప్పున ఇస్తోంది. ఏడాదిలో నాలుగు విడతలకు రూ.28 లక్షలు మందులకు అందజేస్తోంది.నిర్దేశించిన విధంగా పశువైద్యశాలలకు విడతల వారిగా మందులకు నిధులు విడుదల చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాడి రైతులు పశు వైద్యశాలలకు వెళ్లేందుకు వెనకడగు వేస్తున్నారు.

అడుగడునా నిర్లక్ష్యం..

నగరానికి సమీపంలో పశువైద్యశాలలు ఉన్నా.. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో పశువులకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదని తెలుస్తోంది. ఒక్కలిద్దరు సిబ్బందితోనే పశు వైద్యశాలలను ఒక్కలిద్దరు సిబ్బంది మాత్రమే నడిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.పర్యవేక్షణ కొరవడటంతో రోజుల తరబడి పలు పశువైద్యశాలలకు డాక్టర్లు, సిబ్బంది రాకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు.

43 లక్షల పశుసంపద..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పశుసంపద 43,00,886 కాగా, ఇందులో గోజాతి పశువులు 27,068, గేదెజాతి పశువులు 59,895, గొర్రెలు 1,49,401, మేకలు 40 వేలు,పందులు, 2,485, కోళ్లు, 39,72,037, కుక్కలు 50 వేలు ఉన్నాయి.

సిబ్బంది కొరత..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఏర్పడి ఐదేళ్లు గడిచినా... జిల్లాస్థాయి పశు వైద్యశాల లేదు. ప్రస్తుతం ఉన్న పశువైద్యశాలలో సిబ్బంది కొరత వేధిస్తోంది. మేడ్చల్, ఉప్పల్ ఏరియా ఆసుపత్రులతో పాటు ఘట్కేసర్, పోచారం, డబుల్పూర్, పూడూరు, ఎంసీపల్లి, ఉద్దమర్రి, శామీర్పేట్, యాంజల్, దుండిగల్, అల్వాల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్పల్లి, మల్కాజిగిరిల్లోని ప్రాథమిక పశు వైద్యశాలల్లో డాక్టర్‌తో సహా ఇద్దరి సిబ్బంది చొప్పున.. ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల ఖాళీలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో ఇద్దరు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, అటెండర్ పోస్టులతో సహా 21 ఖాళీలు ఉన్నాయి. దీంతో పశువులకు అరకొర వైద్యసేవలు మాత్రమే అందుతున్నాయి.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలి



సంజీవ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థలో రోజు వారీ కూలిగా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఔట్ సోర్సింగ్ కింద తీసుకోవాలని కోరుతూ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బోడుప్పల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశమైన 131 మంది కార్మికులు వినతి పత్రం అందజేశారు. తమను రోజు వారి కూలి కింద జీతం ఇస్తున్నారని, ఔట్ సోర్సింగ్ మార్చి పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలి



నగదు ప్రోత్సహం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని బోడుప్పల్ 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి అన్నారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన తన సొంత నిధులను నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బోడుప్పల్ నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో తనుశ్రీ, రుషికేశ్, షాలిని చాంపియన్‌లుగా నిలిచారు. బోడుప్పల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తనుశ్రీకి రూ 10 వేలు, రిషికేశ్, షాలినికి రూ 1000లు నగదు, మెడల్స్‌ను ఆయన అందజేశారు.

ప్రపంచం మెచ్చిన ప్రధాని మోదీ



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

రామంతాపూర్: మేరా మాటి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామంతాపూర్ పరిధిలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం, పాండురంగ స్వామి దేవాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మట్టిని సేకరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో బీజేపీ అత్యధిక మెజారిటీ స్థానాలు సాధిస్తుందన్నారు.

తాగునీటి వృథాను పట్టించుకోరా?



పోచారం: ఒక వైపు నీటి కొరతతో ప్రజలు అల్లాడుతుంటే, మరో వైపు తాగునీటిని వృథా చేస్తున్న వైనం పోచారం మున్సిపాలిటీలో కనిపిస్తుందని కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆరోపించారు. ఎల్ఐజీ కాలనీలో తాగునీరు లీకైన ప్రాంతాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజులుగా తాగునీరు లీకై రోడ్లపై పారుతున్నా మరమ్మతులు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పాదయాత్ర



బస్తీల్లో పాదయాత్ర నిర్వహిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని మధురానగర్ యాదయ్య హోటల్, నవరంగ్‌గూడ, వాసవినగర్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డినగర్‌లో ఆదివారం ఉప్పల్ సీనియర్ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వారం రోజుల్లోగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు.

మందు బాబులకు అడ్డాగా చిన్న చెరువు



చిన్న చెరువు వాకింగ్ ట్రాక్‌ల వద్ద మద్యం బాటిళ్లు

రామంతాపూర్: డివిజన్ పరిధిలో ఉన్న చిన్న చెరువు మందుబాబులకు అడ్డాగా మారిందని ఐద్వా మహిళా సంఘం ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి పల్లవి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చిన్న చెరువు ప్రాంగణంలో ఉన్న గ్రౌండ్‌కు స్థానికులు వస్తుంటారన్నారు. సాయంత్రం కాగానే ఈ చెరువు గ్రౌండ్‌లో మందు బాబుల బెడద ఎక్కువగా ఉంటుందని దీంతో మహిళలు భయపడి రావడం మానేశారని ఆమె పేర్కొన్నారు. ఉప్పల్ పోలీసులు తరచుగా ఈ ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జా.. స్థానికుల ఆందోళన



శామీర్‌పేట్: శామీర్‌పేట మండల రెవెన్యూ పరిధిలోని ఉప్పరిపల్లిలోని ప్రభుత్వ భూమిలో శనివారం అర్ధరాత్రి స్థానికేతరులు గుడిసెలు వేసి కబ్జాచేశారు. దీంతో గ్రామస్తులు ఆదివారం ఉదయం అక్కడికి వెళ్ళి ఆందోళనకు దిగారు. పోలీసులు గ్రామస్తులను అక్కడి నుండి పంపించారు. శామీర్‌పేట మండల తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని, సోమవారం పోలీస్ బందోబస్తుతో కబ్జాలను తొలగిస్తామని తెలిపారు.

డబుల్‌పై గుబుల్

- మేడ్చల్ రూరల్‌లో మొత్తం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 2,350
- పూర్తయినవి 683 మాత్రమే
- నిర్మాణ దశలోని ఇళ్లు 340... ప్రారంభ దశలో 1329 ఇళ్లు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: పేదల కలల సౌధం సొంతింటి కల రూరల్‌లో నెరవేరని పరిస్థితి నెలకొంది. మేడ్చల్ జిల్లా రూరల్ ప్రాంతంలో ఇళ్లు లేని నిరుపేదలకు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు పడకేశాయి. గృహలక్ష్మి పథకం ప్రవేశంతో డబుల్ ఇళ్ల నిర్మాణాలపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. .అలాగే, జిల్లాలోని అర్బన్ ప్రాంతమైన జీహెచ్ఎంసీ పరిధిలోని 4 అసెంబ్లీ నియోజకవర్గాలలో డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అవటంతోపాటు..పూర్తయిన ఇళ్లను కూడా టాంపర్ సాఫ్ట్ వేర్ పద్ధతి ద్వారా పంపిణీ చేశారు.(అర్బన్ ప్రజలకు సంబంధించి జీహెచ్ఎంసీ కొన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్మించి ,పంపిణీ చేసింది.)అర్బన్‌లో మొదటి దశ ఇళ్ల కేటాయింపులో భాగంగా ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 500 చొప్పున 2 వేల మందికి కేటాయించారు. అలాగే రెండో దశకు సంబంధించి ఇళ్ల కేటాయింపునకు కసరత్తు చేస్తున్నారు. అయితే రూరల్ ప్రాంతంలో మాత్రం దీనికి భిన్నంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు,కేటాయింపులు నత్తకు నడక నేర్పుతున్నాయి.

రూరల్‌లో ఇళ్ల మంజూరు 2,350 .. పూర్తయినవి 683 మాత్రమే

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రూరల్ ప్రాంతానికి ప్రభుత్వం 2,350 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 683 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా ఇందులో 300 ఇళ్ల వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే,మిగతా 340 ఇళ్ల నిర్మాణాలు తుది దశలో ఉండగా, మరో 1329 ఇళ్లు వివిధ నిర్మాణ దశలతోపాటు టెండర్ల ప్రక్రియలో కొనసాగుతున్నాయి.

రెండు శాఖల అధ్వర్యంలో...

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ(ఆర్అండ్‌బీ), పంచాయతీ రాజ్ శాఖ(పీఆర్)లు నిర్వహిస్తున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధ్వర్యంలో 23 ప్రాంతాల్లో రెండు దశల్లో 1176 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టగా, ఇప్పటి వరకు చెంగిచర్ల, కీసర, యాద్గార్‌పల్లి, పీర్జాదిగూడ, పర్వతాపూర్, తుర్కపల్లి, కిష్టాపూర్,సోమారం, చీర్యాల, బోడుప్పల్, ఘట్కేసర్, కొర్రెముల తదితర ప్రాంతాల్లో 501 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 10 ప్రాంతాల్లోని 675 ఇళ్లు వివిధ దశల నిర్మాణాలతో పాటు టెండర్ల ప్రక్రియ దశలో ఉన్నాయి.
- పంచాయతీ రాజ్ (పీఆర్) శాఖ అధ్వర్యంలో రాజబోల్లారం, తుర్కపల్లి, శామీర్‌పేట, అనంతారం, జగ్గంగూడ, కేశవాపూర్, కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, నారాయణపూర్, చీర్యాల,యద్గార్‌పల్లి, నారపల్లి, ప్రతాపసింగారం, బోడ్పుల్, మేడిపల్లి,పర్వతాపూర్ ప్రాంతాల్లో 1174 డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా, ఇప్పటి వరకు 182 ఇళ్లు పూర్తయ్యాయి. 284 ఇళ్ల నిర్మాణాలు ప్రగతి దశలో ఉండగా, మిగిలిన ఇళ్లు ప్రారంభ దశలోనే ఉన్నాయి.

గృహలక్ష్మి పథకంతో... డబుల్‌పై అనుమానాలు

ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెటట్టంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కేటాయింపులపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత స్థలం ఉన్న వారందరికీ మహిళల పేరుతో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోంది.ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ప్రతీ నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను జిల్లా అధికార యంత్రాంగం స్వీకరించింది. ఇప్పటి వరకు జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 14,025 దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్ర స్థాయిలో వడబోసిన యంత్రాంగం లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు చేస్తోంది.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



అల్వాల్‌లో దీక్ష ప్రారంభిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటి చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని తెలంగాణ అమరవీరుల శిభిరం వద్ద శాంతియుత దీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇన్ని రాజకీయ పార్టీలు వారి వారి మేనిఫెస్టోలో ఉద్యమకారుల కొరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, తెలంగాణ ఉద్యకారులను తెలంగాణ స్వాతంత్ర సమరయోదులుగా గుర్తించాలని, ఉద్యమకారులకు ప్రతి నెల పెన్షన్‌తో పాటు బస్సు, ట్రైన్ పాసులు, ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలలో 20 శాతం కోటా కేటాయించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్, రవి,ఓంకార్, బొట్టు ప్రభాకర్, గడ్డం భాస్కర్, విలియం, ముత్యాలు, ఉద్యకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో ఆనందాన్ని పొందాం



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఉప్పల్: దాదాపుగా మూడు దశాబ్దాల పాటు కేంద్రీయ విద్యాలయ సంస్థల్లో పని చేసి విద్యారంగానికే వన్నె తెచ్చిన ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందడం బాధగా ఉందని ఉప్పల్ కేంద్రియ విద్యాలయ–2 ప్రిన్సిపల్, ఎఎ ఇబ్రాయిల్ అన్నారు. కేవీ–2 పాఠశాల ఉపాధ్యాయులు రంగాచారి, గోపాల కృష్ణారావు, గౌసియా బేగం, రామిరెడ్డిల పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, కేవీ సంఘటన్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రూ.1.35 కోట్ల వ్యయంతో ఎఫ్ఎస్‌టీపీ, ఏబీసీ సెంటర్ల ఏర్పాటుకు ఆదివారం మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో గతంలో మౌలిక వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మోడల్‌సిటీగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏకే.మురుగేష్, జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, మేక లలితయాదవ్ పాల్గొన్నారు.

మేరు సంఘం తెలంగాణ బ్యాడ్మింటన్ పోటీలు

ఉప్పల్: ఉప్పల్ విజయపురి కాలనీలో ఆదివారం తెలంగాణ మేరు సంఘం బ్యాడ్మింటన్ పోటీలను ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు కరుణాకర్, టోర్నమెంట్ నిర్వాహకులు అరుణ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.



అంబేడ్కర్.. స్వేచ్ఛ సమానత్వానికి నిదర్శనం



ఘట్‌కేసర్: భారత దేశంలో స్వేచ్ఛ, సమానత్వానికి నిలువెత్తు నిదర్శనం అంబేడ్కర్ అని పోచారం మున్సిపాలిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల సమర్పణ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కుల, మత, లింగ బేధం లేకుండా భారత్ నిర్మాణానికి పాటుపడాలని అన్నారు. అరుణ్‌కుమార్, దాసు, నర్సింగ్ రావు, శ్రీనివాస్, రాజేశ్, నారాయణ పాల్గొన్నారు.

రెండు పడకల ఇళ్లను స్థానికులకే కేటాయించాలి



ఆందోళన చేస్తున్న వైస్ ఎంపీపీ జంగమ్మ తదితరులు

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను స్థానికులకు ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాల వారికి కేటాయించాలని వైస్ ఎంపీపీ జంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతాపసింగారంలో పట్టాలు పంపిణీ చేసిన రెండు పడకల ఇళ్లను ముందుగా స్థానికులకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన ఇళ్లను గ్రామానికి చెందిన వారికి కాకుండా అంబర్‌పేట్, ఎల్బీనగర్ నియోజకవర్గాల వారికి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. స్థానికులకు ఇళ్లను ఇవ్వని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ముందు ఆందోళన..



పూడూరులో మరమ్మతులు చేపడుతున్న అధికారులు

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూరు గ్రామస్తులు గ్రామంలో విద్యుత్ సబ్ సమస్యను పరిష్కరించాలని గోసాయిగూడ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో విద్యుత్ ఓల్టేజీ సమస్య, సమాచారం లేకుండా సరఫరాను నిలిపివేత పై విద్యుత్ సిబ్బంది రవినాయక్, లైన్‌మెన్‌లకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామంలోని పలు బస్తీలలో విద్యుత్ సమస్య తీవ్రతరమైంది. నిత్యం విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది పడిన ప్రజలు సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేశారు. దీంతో అధికారులు సమస్యను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతిచెందిన జిబ్రాణి

శామీర్‌పేట్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన జిబ్రాణి (26), మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ కాలనీలో నివాసం ఉంటూ స్థానిక సిమెంట్ దుకాణంలో కూలీగా పనిచేస్తున్నాడు. రోజూ లాగే పని ముగించుకొని లాల్‌గడి మలక్‌పేట నుండి జగ్గంగూడకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారుడు జిబ్రాణీని వెనకాల నుండి అతి వేగంగా ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.